

పెండింగు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మిథానీ కాలనీవాసులు

ఎమ్మెల్యేని కలిసిన మిథానీ కాలనీవాసులు

హయత్‌నగర్, మే 15(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని మిథానీ కాలనీలో మిగిలిపోయిన అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కోరుతూ గురువారం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో సబ్ లైన్లను సీసీ రోడ్లుగా మార్చాలని, కాలనీలో ఉన్న 1200 గజాల పార్కు స్థలానికి ప్రహరీ నిర్మించాలని, అత్యాధునిక సౌకర్యాలతో ఆట స్థలం అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిథానీకాలనీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. కాలనీలో మిగిలిపోయిన అభివృద్ధి పనులను త్వరలో పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, రాకేష్‌కుమార్, లక్ష్మణ్ ముదిరాజ్, కాలనీ నాయకులు యాదిరెడ్డి, కృష్ణ రాంరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

మన్సూరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ చిత్రసీమ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన గురువారం స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడలోని అష్టాక్షరీ జీయర్‌స్వామి మంగళశాసనముల నడుమ జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకోగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ మన్సూరాబాద్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, సీనియర్ నాయకుడు పోచబోయిన జగదీష్‌యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, మోహన్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, మే 15(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలోని అంబర్‌పేట మండల పరిధిలోని 62మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన యువతీ వివాహానికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందుకోవడానికి అర్హులైన లబ్ధిదారులు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంబర్‌పేట మండలం ఆర్ఐ ఎం.అరుణతో పాటు పలువురు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, మే 15(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీకి చెందిన దాదిమల్ల అలివేలు గుండె నొప్పితో ఇటీవల నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. ఆమెను పరీక్షించిన వైద్యులు గుండెకు సంబంధించిన చికిత్స అవసరం ఉందని తెలిపారు. దీంతో ఆమె ఆస్పత్రిలో వైద్య ఖర్చుల కోసం ఆర్ఎన్ఆర్‌కాలనీ తాజా మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ ద్వారా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రెండున్నర లక్షల రూపాయలు మంజూరు అయింది. అందుకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాన్ని గురువారం మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్ లబ్ధిదారు అలివేలుకు అందజేశారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

వనస్థలిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వామపక్షాలు ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో హయత్‌నగర్ మండల ఏఐటీయూసీ మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ హాట్ స్పాట్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రమావత్ నక్రునాయక్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నర్సింహ, భాగ్యమ్మ, మంగ, రవికిరణ్, ప్రశాంతి, సునీత, ప్రభావతి, లింగమ్మ పాల్గొన్నారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

బస్తీల సమస్యల పరిష్కారానికి చర్యలు: పవన్‌కుమార్

కొత్తపేట, మే 15(ఆంధ్రజ్యోతి): కొత్తపేట బస్తీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం భరత్‌నగర్-1, రాజీవ్‌గాంధీనగర్ -2 బస్తీల్లో పర్యటించారు. తాగునీరు సరిపడా సరఫరా కావడంలేదని, రాజీవ్‌గాంధీనగర్ వద్ద డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని బస్తీల ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.49లక్షలతో భరత్‌నగర్ - 1 నుంచి రాజీవ్‌గాంధీనగర్ -2 వరకు శుక్రవారం నుంచి నూతన సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. పనులు చేపట్టే ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో భరత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి రాంచందర్, కోశాధికారి కిన్నెర పరశురామ్, ప్రతినిధులు స్వామి, వెంకటేష్, భిక్షపతి, మల్లేష్‌యాదవ్, సైదులు, బాలు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు

చంపాపేట, మే 15(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని వందనపురి కాలనీ నుంచి కేకే గార్డెన్ వరకు వరదనీటి కాలువ నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ నిధులు రూ7.5కోట్లు మంజూరైనట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ గురువారం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా ప్రాంతాలను తాను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించి కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలను మధుయాష్కీగౌడ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నిధులు మంజూరు చేయించినట్లు కార్పొరేటర్ తెలిపారు. వరద కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, మధుయాష్కీగౌడ్, మేయర్ విజయలక్ష్మిలకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. హస్తినాపురం డివిజన్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



బహుమతి అందజేస్తున్న డిప్యూటీ ఎంఈఓ రాధాకృష్ణ, హెచ్ఎం విజయలక్ష్మి

సైదాబాద్ : మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 1వ తేదీన ప్రారంభమైన ఉచిత వేసవి శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ శిబిరంలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు యోగా, మెడిటేషన్, స్పోకెన్ ఇంగ్లీషు, మాథ్స్ పజిల్స్, సైన్స్ ప్రయోగాలు, కంప్యూటర్, ఆర్ట్స్, మెహందీ, ఎంబ్రాయిడరీ, చిత్రలేఖనం వంటి అంశాలలో శిక్షణ ఇచ్చారు. తిరునగరి రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి బహుమతులు అందజేశారు.

జేజే బోర్‌వెల్స్ టూ బంజారా కాలనీ..!

ట్రంకు లైనుగా మారిన వరదనీటి కాలువ..?

- కంపువాసన భరించలేక ఇబ్బందిపడుతున్న ప్రజలు
- వరదనీటి కాలువ ఏర్పాటుతో ఐదు కాలనీలకు మూసుకుపోయిన డ్రైనేజీ వ్యవస్థ

ప్రమాదం అంచున వరద నీటి కాలువ..



బాతుల చెరువు అలుగునీటి కోసం కట్టమైసమ్మకాలనీ జేజే బోర్ వెల్స్ నుంచి బంజారాకాలనీ వరకు నిర్మించిన వరదనీటి కాలువ ప్రమాదం అంచుకు చేరింది. కాలువకు కుడి వైపున ఉన్న కాలనీలకు భూగర్భ డ్రైనేజీ లేకపోవడంతో అనేక మంది డ్రైనేజీని వరదనీటి కాలువలో కలుపుతున్నారు. ఎన్నిసార్లు అధికార్లకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వరద కాలువ నేడు ట్రంకు లైనుగా మారింది. దుర్గంధవాసన భరించలేక ప్రజలంతా నాకు ఫిర్యాదు చేస్తున్నారు. **- కళ్లెం నవజీవన్‌రెడ్డి, కార్పొరేటర్, హాయత్‌నగర్**

హయత్‌నగర్, మే 15(ఆంధ్రజ్యోతి): బాతులచెరువు నిండి అలుగునీరు వచ్చి కాలనీలను ముంచేస్తుందని ప్రజలు గగ్గోలుపెడితే అధికారులు, నాయకులు కష్టపడి వరదనీటి కాలువను మంజూరు చేయించారు. రెండు సంవత్సరాల క్రితం హయత్‌నగర్ బాతుల చెరువుకట్ట కింద గల కట్టమైసమ్మకాలనీ మీదుగా జేజే బోర్‌వెల్స్ నుంచి బంజారాకాలనీ వరకు కిలోమీటరు దూరం 15కాలనీలను విభజిస్తూ మధ్యలో 10ఫీట్ల వెడల్పు, పది ఫీట్ల లోతులో వరదనీటి కాలువను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీలకు వరదనీటి ముంపు తప్పింది. అంతవరకు బాగానే ఉంది. వరదనీటి కాలువ నిర్మాణం సమయంలో అక్కడ ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. నిర్మాణం పనులు పూర్తికాగానే కొత్త డ్రైనేజీ లైను వేస్తామని అధికారులు చెప్పి ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. వరదనీటి కాలువకు ఎడమ వైపుకు ఉన్న కాలనీల వారు మొదటి నుంచి ఉన్న భూగర్భ డ్రైనేజీని వాడుతున్నారు. మధ్యలో వరదనీటి కాలువ నిర్మించడంతో కుడి వైపు కు ఉన్న కాలనీలకు పూర్తిగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకుండా పోయింది. వరద నీటి కాలువకు కుడి వైపుకు ఉన్న షిరిడీనగర్, పర్వతనగర్, బృందావన్‌కాలనీతో పాటు మరో ఐదు కాలనీలకు చెందిన వారు ప్రత్యామ్నాయ మార్గం లేక డ్రైనేజీని వరదనీటి కాలువలో కలుపుతున్నారు. దీంతో వరద నీటి కాలువ ఇప్పుడు ట్రంకు లైనుగా మారింది. వరదనీటి కాలువపైన అక్కడక్కడ నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్ నుంచి దుర్గంధ వాసన వస్తుంది. ప్రజలు దానినే రోడ్డుగా ఉపయోగిస్తున్నందున దుర్గంధ వాసనను భరించలేకపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా స్థానిక కాలనీల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



ట్రంకు లైనుగా మారిన వరద నీటి కాలువ



జేజే బోర్ వెల్స్ ముందు నుంచి బంజారాకాలనీ రోడ్డు

వరదనీటి కాలువపైనే ప్రధాన రోడ్డుమార్గం

కట్టమైసమ్మకాలనీ జేజే బోర్‌వెల్స్ నుంచి బంజారాకాలనీ కిలోమీటర్ దూరం వరకు నిర్మించిన వరదనీటి కాలువ స్లాబ్‌నే ప్రజలు రోడ్డుగా వాడుతున్నారు. దాదాపు 15కాలనీల ప్రజలు రోజు రాకపోకలు సాగిస్తున్నారు. అయినా అధికారులు ఈ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించకుండ గాలికి వదిలివేశారు. వర్షం కురిస్తే వరదనీటి కాలువకు ఇరువైపుల చిత్తడి చిత్తడిగా మారుతుంది. ఆ సమయంలో రోడ్డుపైన ఎదురుగా ఒక వాహనం వస్తే అంతే సంగతి. రోడ్డు కిందకు దిగలేని పరిస్థితి నెలకొంటుంది.

భూగర్భ డ్రైనేజీని నిర్మించండి



వరద నీటి కాలువకు కుడివైపుకు ఉన్న కాలనీల కోసం ముందుగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థని నిర్మించండి. డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వేలాది మంది రాకపోకలు సాగించే జేజే బోర్ వెల్స్ టూ బంజారాకాలనీ రోడ్డును డబల్ రోడ్డుగా మార్చాలి. **- భద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు, తిరుమలకాలనీ**

చాణక్యపురి కాలనీలో స్వచ్ఛభారత్

మన్సూరాబాద్: నాగోల్ డివిజన్ చాణక్యపురికాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కాలనీ పరిసరాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ చీపురు చేతబూని పరిసరాలను శుభ్రం చేశారు. జీహెచ్ఎంసీ ద్వారా వచ్చిన స్పోర్ట్స్ కిట్‌ను చాణక్యపురికాలనీవాసులకు కార్పొరేటర్ అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు చలపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ డిస్టిక్ హెల్ప్‌లైన్ సెంటర్

హయత్‌నగర్ : హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులు డిగ్రీ కోర్సులో చేరుటకు దోస్త్ డిస్టిక్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని అడ్మిషన్లు పొందాలని కోరారు. దోస్త్ సహాయ కేంద్రం ఉదయం 10.30 నుంచి 4.30వరకు తెరిచి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు దోస్త్ సహాయ కేంద్రం కో-ఆర్డినేటర్ బి. నరసింహ ఫోన్- 99489 85954లలో సంప్రదించాలని కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

సరూర్‌నగర్ : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని మీర్‌పేట్ పోలీసులు సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. మీర్‌పేట్‌లోని హనుమాన్‌నగర్‌కు చెందిన మధుసూదన్(45) ప్రైవేట్ ఉద్యోగి. కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గురువారం బెడ్‌రూంలోకి వెళ్లి గడియపెట్టుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే మీర్‌పేట్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి తలుపులు పగులగొట్టారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించి రక్షించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను కాళేశ్వరానికి మళ్లించింది

● మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్



ఫ్లైఓవర్‌ను పరిశీలిస్తున్న మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, సుజాతానాయక్ తదితరులు

చంపాపేట, మే 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను పక్కనపెట్టి నిధులను కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆరోపించారు. సాగర్ రింగ్‌రోడ్ చౌరస్తాలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఫ్లైఓవర్ లూప్‌ను గురువారం జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు సుజాతానాయక్‌తో కలిసి మధుయాష్కీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం, పది రోజుల్లో ఫ్లైఓవర్ వాహనదారులకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఎల్బీనగర్ నుంచి వచ్చే వాహనాలు కర్మన్‌ఘాట్, చంపాపేట, సంతోష్‌నగర్ వైపు వెళ్లేందుకు సులభతరం కానుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, డేరంగుల కృష్ణ, తోకటి కిరణ్, ప్రవీణ్‌రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్, సుధీర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

వనస్థలిపురం : ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్‌కు చెందిన బొడ్డు సరోజ, జక్కర్తి మారెమ్మలు అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం అధిక మొత్తంలో ఖర్చులు అయ్యాయి. దీంతో ఆర్థిక సమస్యల దృష్ట్యా వారు కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో మధుయాష్కీగౌడ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన ఆ చెక్కులను గురువారం బాధిత కుటుంబాలకు మధుయాష్కీ వనస్థలిపురం కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామారావు, అశోక్‌గౌడ్, సత్యనారాయణ, సదాశివుడు పాల్గొన్నారు.

మొరిశెట్టికి ఘన నివాళి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, గణేష్‌గుప్తా

ఎల్బీనగర్: కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయస్వామి ఆలయ మాజీ ధర్మకర్త మొరిశెట్టి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే, మాజీమంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీనివాస్ దశదిన కర్మ గురువారం ఆర్‌కేపురం డివిజన్ వాసవీకాలనీలోని ఆయన నివాసంలో నిర్వహించారు. సబితారెడ్డి, గణేష్‌గుప్తా, దేప భాస్కర్‌రెడ్డిలు శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జిల్లెల కృష్ణారెడ్డి, మురుకుంట్ల అరవింద్‌శర్మ, రాంనర్సింహగౌడ్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, సాజిద్, పెంబర్తి శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, జగిని రమేష్, మంచుకొండ సురేందర్‌గుప్తా, శ్రీనివాస్, పద్మారాము, మహేందర్, శ్రీనివాస్, రాజ్‌కుమార్‌గుప్తా పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు

చంపాపేట, మే 15(ఆంధ్రజ్యోతి): యువతిని అసభ్యంగా ప్రవర్తించి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన ఐదుగురిపై కంచన్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయణగుట్టకు చెందిన ప్రైవేట్ డాక్టర్ మదరున్నిసా(25) ఈనెల 10న మధ్యాహ్నం 1:30గంటల ప్రాంతంలో డీఎమ్ఆర్ఎల్ చౌరస్తాలోని సాయిబాబా ఆలయం సమీపంలో ప్రధాన రహదారిపై తన బాయ్‌ఫ్రెండ్‌తో కారులో కూర్చొని మాట్లాడుతుంది. అక్కడికి చంపాపేటకు చెందిన మూసాఅలీ జాబ్రీ(19), జహంగీర్(20), ముస్తాయిద్(19)తో పాటు మరో ఇరువురు వచ్చి యువతితో అసభ్యంగా ప్రవర్తించారు. యువతి భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది. బుధవారం యువతి షీటీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. షీటీమ్స్ వారు కేసు నమోదు చేసుకొని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంటనే విచారణ చేపట్టి ఆ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇరువురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో ఐదుగురికి రిమాండు

కొత్తపేట, మే 15(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న వరకట్న వేధింపుల కేసులో పోలీసులు గురువారం అయిదుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని శివపురికాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజనీరు పెండెం రాజశేఖర్, అతడి కుటుంబ సభ్యులూ వేధించడంతో అతడి భార్య జాస్మిని ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శివపురికాలనీలో మంగళవారం చోటు చేసుకున్న వరకట్నం వేధింపుల కేసులో మృతురాలి తండ్రి కట్టా వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో జాస్మిని భర్త పెండెం రాజశేఖర్, అతడి సోదరుడు పెండెం నగేష్, అతడి సోదరి రుద్ర భార్గవి, అతడి తల్లి పెండెం సరిత, అతడి బావ రుద్ర రాధాకృష్ణలను అరెస్టు చేసి, విచారించారు. వారిని రిమాండుకు తరలించారు.

బలిజగూడలోని వీరభద్రస్వామి ఆలయంలో చోరీ

అబ్దుల్లాపూర్‌మెట్: మండలం బలిజగూడలోని వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్వామి వారికి చెందిన సుమారు 2కేజీల వెండి, 22 గ్రాముల బంగారు వస్తువులను అపహరించుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు వీరభద్రస్వామి ఆలయం ప్రధాన ద్వారం తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. స్వామివారిపై ఉన్న 1కిలో వెండి నాగభరణం, అరకిలో వెండి పల్లెం, ఖడ్గం, కోరమీసాలు, వెండి తీర్థ ప్రసాదం గిన్నెతో పాటు 22 గ్రాముల బంగారు వస్తువులను అపహరించుకుపోయారు. వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి క్లూస్ టీం బృందంతో వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు త్రైమాసిక అవార్డుల ప్రదానం



త్రైమాసిక అవార్డులను అందుకున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెయిన్‌టెనెన్స్ సిబ్బందితో రీజినల్ మేనేజర్ శ్రీలత

చాదర్‌ఘాట్, మే 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ ఆదాయాన్ని పెంచడంలో నైపుణ్యతను ప్రదర్శించిన ఉద్యోగులకు త్రైమాసిక అవార్డుల ద్వారా ప్రశంసిస్తున్నట్లు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత తెలిపారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ హైదరాబాద్-2 డిపోలో జరిగిన త్రైమాసిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలతోనే ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్క ఉద్యోగి గుర్తించి విధులను నిర్వర్తించాలని సూచించారు. రీజియన్‌లోని ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, మెయిన్‌టెనెన్స్ సిబ్బందికి త్రైమాసిక అవార్డులను ఆమె అందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి, పర్సనల్ మేనేజర్ శ్రీనివాస్, కస్టమర్ రిలేషన్ మేనేజర్ శ్రీనివాస్, హైదరాబాద్-2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి, డిపో మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాద స్థావరాలపై సైనికుల దాడి దేశానికే గర్వకారణం

●బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు

మన్సూరాబాద్: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో భారత సైనికులు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ ఉగ్రవాద స్థావరాలపై విజయవంతంగా చేపట్టిన దాడి యావత్ భారతావనికి గర్వకారణమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశ సైనికులను గౌరవిస్తూ ప్రతి భారతీయుడిలో మనోధైర్యాన్ని నింపడమే లక్ష్యంగా బీజేపీ కేంద్ర పార్టీ పిలుపు మేరకు ఈనెల 17న దేశవ్యాప్తంగా తిరంగా ర్యాలీ నిర్వహించతలపెట్టడం జరిగిందన్నారు. తెలంగాణలో హైదరాబాద్ నడిబొడ్డున ట్యాంక్‌బండ్ వద్ద జరిగే ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా ప్రభారి సుభాష్‌చందర్‌జీ, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్లు కొత్త రవీందర్‌గౌడ్(ఎల్బీనగర్), రాఘవేంద్రరావు(శేరిలింగంపల్లి), జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, జోర్రీగల శ్రీకాంత్, బండారి భాస్కర్, కార్పొరేటర్లు వంగా మధుసూదన్ రెడ్డి, రంగా నర్సింహగుప్తా, నాయికోటి పవన్‌కుమార్, కళ్లెం నవజీవన్ రెడ్డి, చింతల సురేందర్‌యాదవ్, నందికొండ గీతారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తా



భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్లు నరసింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, మే 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో డివిజన్ ప్రజలకు తాను ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఆయన హయత్‌నగర్ ఏరియాలోని వినాయకనగర్‌కాలనీ, ఎల్లారెడ్డి కాలనీ, వినాయకనగర్‌కాలనీ-2లలో రూ.25లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ వినాయకనగర్ పరిసర కాలనీల్లో 15 సంవత్సరాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా చిన్న సైజులో డ్రైనేజీ లైనును ఏర్పాటు చేశారు. ఇటీవలి కాలంలో అనేక అపార్టుమెంట్లు, కొత్తగా ఇళ్ల నిర్మాణం జరిగాయని తెలిపారు. దీంతో తరుచూ అక్కడక్కడ డ్రైనేజీ పొంగుతుండేదని తెలిపారు. ఈ కాలనీల్లో ఇదో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తాను గెలిచిన మొదట్లో సమస్య తీవ్రతను గుర్తించి అధికారులతో ఎస్టిమేషన్ వేయించి జీహెచ్ఎంసీకి పంపడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డి, వినాయకనగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కళ్లెం శంకర్‌రెడ్డి, నాయకులు రుక్మారెడ్డి, జిట్ట మహేష్, రమణారెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, నక్క రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ గురించి మాట్లాడడం సిగ్గుచేటు

● కార్పొరేటర్ నర్సింహారెడ్డిపై బీఆర్ఎస్ నేతల ఫైర్

మన్సూరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): ఇదివరకు ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిపై బీఆర్ఎస్ డివిజన్ నాయకులు మండిపడ్డారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డిల ఆధ్వర్యంలో ఇందిరానగర్‌కాలనీలో గల పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తాను పాటించకుండా ప్రొటోకాల్ గురించి పదేపదే మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కనీసం సమాచారం ఇవ్వకుండా శంకుస్థాపనలు చేసుకుంటూ పోయిన ఆయన ఎమ్మెల్యేపైనే లేనిపోని ఆరోపణలు చేసి వివాదాలు సృష్టించారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీష్‌యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చంద్రమోహన్, యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

హయత్‌నగర్ : చెట్టుకు ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45సంవత్సరాల వయస్సు గల పురుషుడు గురువారం కుంట్లూర్ నర్సరి వద్ద వేపచెట్టుకు టవల్‌తో ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. చనిపోయిన వ్యక్తి ఒంటిపై ఎరుపు రంగు టీషర్టు, నలుపు రంగు నెక్కర్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. పోలీసులు శవాన్ని స్వాధీనం చేసుకుని మార్చురికి తరలించారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.